క్లుప్తంగా

రైతుబజార్ సమస్యల పరిష్కారానికి చర్యలు



నరసింహనగర్ రైతుబజార్‌లో పరిశీలిస్తున్న సీఈవో నందకిశోర్

సీతంపేట: రాష్ట్ర రైతుబజార్ల ముఖ్య కార్యనిర్వహణ అధికారి ముల్లంగి నందకిశోర్ గురువారం నరసింహనగర్ రైతుబజార్‌ను సందర్శించారు. ఎన్ని స్టాల్స్ ఉన్నాయి, ఎంతమంది రైతులు వస్తున్నారు, డ్వాక్రా, పీహెచ్ స్టాళ్లు, సదుపాయాలు, కూరగాయల నాణ్యతను ఆయన పరిశీలించారు. బజార్‌లో సమస్యలను ఎస్టేట్ ఆఫీసర్ చినబాబును అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్‌లో సీసీ కెమెరాలు బాగు చేయడం, స్టాల్స్ పైకప్పుగా వేసిన సిమెంట్ రేకులు కొత్తవి వేయడం, టాయిలెట్లు బాగు చేయడం, ఆర్వో ప్లాంట్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, డ్రైనేజీలకు మరమ్మతులు చేయిస్తామని సీఈవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీడీ ఎర్రన్న, ఏడీ షేక్ యాసిన్, డీఈ కెనడీ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



గురుద్వారా జంక్షన్‌లో కారు డిక్కీలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని, వాహనాల డాక్యుమెంట్లు వెంట ఉండాలని ద్వారకా జోన్ ఎస్ఐ జె.ధర్మేంద్ర అన్నారు. గురుద్వారా జంక్షన్‌లో గురువారం వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. కార్లు, వ్యాన్లను తనిఖీ చేశారు. మద్యం తాగిన వారిపై జరిమానాలు వేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు మద్యం తాగకూడదని, అతి వేగంగా నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకు తనిఖీలు పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు.

వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలు

మద్రిపాలెం: వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఈ మేరకు ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. యలమంచిలి ప్రాంతానికి చెందిన కసింకోట భవాని, తన కుమారుడు శశిభూషణ్‌తో కలిసి బుధవారం(గత నెల 31న) కంచరపాలెం కప్పరాడలోని తన బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం కప్పరాడ జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి భవాని, శశిబూషణ్‌తో కలిసి రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఏసర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శశిభూషణ్‌కు గాయాలయ్యాయి. తల్లి ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజలపై మరింత భారం

సీతంపేట: ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలో ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేదని, విశాఖలో పరిపాలన రాజధాని కోసం భవనం కూడా నిర్మించకుండా.. ఆ పేరుతో కబ్జాలకు పాల్పడుతున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి విలువ ఆధారంగా పన్నులు వేస్తూ, భూముల రేట్లు పెంచి ప్రజలపై మరింత భారం వేస్తున్నారన్నారు. సీపీఎస్ రద్దు, నిరుద్యోగుల జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదన్నారు. పాత పన్నుల విధానమే కొనసాగించాలని కోరారు. జనసేన నాయకురాలు రూపాదేవి పాల్గొన్నారు.





కంకర రోడ్డులా మారిన రామచంద్రనగర్ రహదారి

మళ్లీ తవ్వేశారు..!



తవ్వి అసంపూర్తిగా వదిలేసిన గణేష్‌నగర్ రోడ్డు

- తాటిచెట్లపాలెంలో దారుణంగా తయారైన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లోని రోడ్లను మళ్లీ తవ్వేశారు. ఎంతో అందంగా ఉండాల్సిన రహదారులు కాస్తా.. కంకర రోడ్ల కన్నా దారుణంగా తయారయ్యాయి. ముఖ్యంగా జాతీయ రహదారి తాటిచెట్లపాలెం పక్కనే గల రామచంద్రనగర్, గణేష్‌నగర్, ఆంజనేయ స్వామి ఆలయం ముందు, పక్కన ఉన్న రోడ్లన్నీ మట్టి రోడ్లుగా మారి.. స్థానికులు, వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

ఆరు నెలలైనా గడవక ముందే..

ఈ ప్రాంతాల్లోని రహదారులను చాలా కాలం నుంచి యూజీడీ, 24 గంటల తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. గత డిసెంబర్, ఈ జనవరి నెలల్లోనే ఈ రోడ్లను పునరుద్ధరించారు. ఇలా నిర్మించిన వెంటనే వాటిని మళ్లీ తవ్వేయడంతో స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురతున్నారు. మళ్లీ పాత రోజులు వచ్చాయని వాపోతున్నారు. తమ ప్రాంతాల్లోని రోడ్లు బాగుపడ్డాయనే ఆనందం అంతలోనే ఆవిరైందని నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ఒకపక్క గుడి.. మరోపక్క బడి

జాతీయ రహదారి పక్కనే సుందర అభయాంజనేయ స్వామి ఆలయం ఉంది. ఇక్కడికి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి వెళ్తుంటారు. మరోపక్క అంగన్‌వాడీ స్కూల్ ఉంది. దీనికి కూడా నిత్యం పిల్లలు, తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని సార్లు ఈ గోతుల రోడ్ల మీద నడవలేక చిన్నారులు, వృద్ధులు పడిపోయి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. మరో పక్క జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, ఇటువంటి రద్దీ ప్రాంతాల్లో దారులు ఇలా దారుణంగా తయారైతే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

80 ఫీట్ రోడ్డులోనూ ఇంతే..

తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద గల 80 ఫీట్ రోడ్డు కూడా అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో ఇటీవలే కల్వర్టు నిర్మించారు. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకో.. ఏమో తెలియదు గానీ వేసిన వెంటనే అది కృంగిపోయింది. ఈ కల్వర్టు వద్ద రోడ్డు.. ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



80 ఫీట్ రోడ్ కల్వర్టు వద్ద కృంగిపోయిన రహదారి



హైవేపై తాటిచెట్లపాలెం అభయాంజనేయ ఆలయం ముందు రాళ్లు తేలిన రోడ్డు

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



24వ వార్డులో పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి



జోన్–5 దయానందనగర్‌లో పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్, దాసరి శామ్యూల్

సీతమ్మధార: నియోజకవర్గంలో గురువారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. 24వ వార్డు తులసీ పేట, రేసపువానిపాలెం 139 సచివాలయం పరిధిలో వృద్ధురాలికి వృద్ధాప్య పింఛన్, స్వర్ణకుమారికి అనే మహిళకు వితంతు పెన్షన్‌ను కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీనే క్రమం తప్పకుండా పింఛన్లు అందిస్తున్నామన్నారు. వేకువ జాము నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్న వలంటీర్లను కార్పొరేటర్ అభినందించారు. సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జోన్–5లో 89 శాతం పూర్తి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో గురువారం టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వలంటీర్లు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చురుగ్గా చేపట్టినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోన్ పరిధిలో 24 వార్డులకు సంబంధించి మొత్తం 26,154 మంది లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. సుమారు 89 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేసినట్లు టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ తెలిపారు. ఆయా వార్డుల్లో వలంటీర్లు, వెల్ఫేర్ కార్యదర్శులు ఉదయం నుంచి పెన్షన్ పంపిణీలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్సీ కృష్ణ ఆదేశించారు.

బాలల హక్కుల పరిరక్షణకు సహకరించండి

- సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్



మాట్లాడుతున్న ఛైర్మన్ కేసలి అప్పారావు

సీతమ్మధార: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం కోరారు. సీతమ్మధారలో గురువారం 14, 15, 16 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆఖరి వరకు రాష్ట్ర స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ తరుణంలో సచివాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్పించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. దివ్యాంగ బాలలకు పెన్షన్ల జారీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలకు యుద్ధప్రాతిపదికన ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పౌష్టికాహారాన్ని అందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగ కళ్లతో పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులంతా విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయ ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కె.వి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నివారణ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధి 25వ వార్డు రెల్లివీధిలో గురువారం మలేరియా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా సీతంపేటలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించాయి. ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. కరోనా కష్టకాలంలో వైద్య, ఆరోగ్య, పారిశుద్ధ్య, సచివాలయ సిబ్బంది వెలకట్టలేని సేవలు అందించారని కొనియాడారు. మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా జీవీఎంసీ, మలేరియా సిబ్బందికి సహకరించాలని కోరారు.

నీటి నిల్వలు ఉంచొద్దు..

జిల్లా మలేరియా అధికారి వై.మణి, బయాలజిస్ట్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ నెల నుంచి అక్టోబరు వరకు నగరంలో మలేరియా జ్వరాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జీవీఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ రామిరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ మలేరియాను వ్యాప్తి చేసే ఎనాఫిలస్ దోమలు నిల్వ ఉన్న మంచినీటిలో పెరుగుతాయన్నారు. వాటి నియంత్రణకు గోళాలు, కుండీలు, వోవర్‌హెడ్ ట్యాంకులపై మూతలు పెట్టాలని సూచించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు, మలేరియా సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఐదు పుస్తకాల పరిచయ సభ



మాట్లాడుతున్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మం

సీతంపేట: ప్రముఖ కవి, అనువాదకుడు యల్లపు ముకుంద రామారావు అంతర్జాతీయ కవిత్వాన్ని అధ్యయనం చేసి పంచభూతాలకు ప్రతీకాత్మకంగా భావిస్తూ అదే నీరు, అదే గాలి, అదే ఆకాశం, అదే నేల , అదే కాంతి శీర్షికలతో రచించిన ఐదు పుస్తకాల పరిచయ సభ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. చైతన్య సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ ఇది కవి పండిత సభ అని అభివర్ణించారు. ప్రపంచ ప్రసిద్ధ కవిత్వ విలువలను ముకుంద రామారావు ఈ పుస్తకాల్లో పొందుపర్చారన్నారు. అనువాద రచయిత ఎల్ఆర్ స్వామి మాట్లాడుతూ అనువాద ప్రాముఖ్యాన్ని, వివిధ దేశాల కవుల భావజాలం, ఆలోచనలను వివరించారు. సాహితీవేత్తలు డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కె.జి.వేణు, డాక్టర్ ఎ.సీతారత్నం, గరిమెళ్ల నాగేశ్వరరావు, డాక్టర్ మల్లీశ్వరి పుస్తకాలను సభకు పరిచయం చేశారు.

రసవత్తరంగా చదరంగం పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో నిర్వహిస్తున్న చదరంగం శిక్షణలో భాగంగా గురువారం విభాగాల వారీగా విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశారు. కోచ్ ఉమాపతి పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో బాల, బాలికలు ఎంతో నైపుణ్యం ప్రదర్శించారు. ఈ పోటీలు రౌండ్ల వారీగా నిర్వహిస్తున్నందున శుక్రవారం కూడా శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలు కొనసాగనున్నాయి విజేతలకు జ్ఞాపికలు, శిబిరంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు శనివారం సాయంత్రం 6 గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరగనుంది. అనంతరం రాత్రికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు తల్లిదండ్రులు, విద్యార్థులు తప్పక హాజరు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. శిబిరం ఏర్పాట్లను కార్యవర్గ సభ్యులు, క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న కోడూరి సంజీవరావు

సీతంపేట: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడూరి సంజీవరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారంలో భాగంగా గురువారం అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించారన్నారు. సేవ, సుపరిపాలన పేరిట నెల రోజుల పాటు పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో ప్రధాని మోదీ అభివృద్ధి సాధించారని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, రామజన్మభూమి సమస్య పరిష్కారం, స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, సర్జికల్ స్ట్రైక్స్ వంటి ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుని దేశ ఆర్థికాభివృద్ధిని ప్రపంచంలోనే 5వ స్థానానికి తీసుకెళ్లారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు మంచా నాగమల్లేశ్వరి, విజయలక్ష్మి, కె.మధుసూదనరావు, బి.పోతురాజు, జి.రామచంద్ర, జె.శ్రీనివాస్, ఈశ్వరరావు, కల్యాణి పాల్గొన్నారు.

జీర్ణకోశ సమస్యల నివారణకు ప్రత్యేక శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో జీర్ణకోశ సంబంధ వ్యాధుల నివారణకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచించనున్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లు



కిట్లు అందిస్తున్న డాక్టర్ మట్టా శశిప్రియాంక

కంచరపాలెం: ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పేరిట క్షయ వ్యాధి నివారణలో భాగంగా డీటీసీవో అండ్ డీఎంటీవో ఆదేశాల మేరకు గురువారం రామ్మూర్తిపంతులుపేట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక చేతుల మీదుగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. మూడు సెంటర్లకు సంబంధించి 31 మంది రోగులకు పోషకాహార కిట్లు అందజేసినట్లు సెంటర్ టీబీ ప్రతినిధి ఎస్.పైడిరాజు తెలిపారు. టీబీ సిబ్బంది పూర్ణిమ, శరత్, రామచంద్రరావు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని కప్పరాడ, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతినగర్, జయప్రకాష్ నగర్, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, అప్పర జయప్రకాష్‌నగర్ కప్పరాడ, రాంజీ ఎస్టేట్స్, కొత్తూరు, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, సిద్ధార్థనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో రేపు..

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలోని హై టెన్షన్ లైన్స్ నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 3న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఆపరేషన్ ఈఈ జి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శాంతినగర్, ఎన్‌జీవోస్ కాలనీ, జీవీఎంసీ హెల్త్ సెంటర్, పద్మశ్రీ హాస్పిటల్ ప్రాంతాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



మాణిక్యాంబ కాలనీలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు మాణిక్యాంబ రజక కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ అల్లు శంకరరావు పరిశీలించారు. ఇటీవల ఈ పనులకు నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేయడం తెలిసిందే. రూ.5 లక్షలతో ఇక్కడ నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను అల్లు శంకరరావు పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానంలో సీసీ బ్రిడ్జి నిర్మించడానికి శంకుస్థాపన చేశామని, పనులు సక్రమంగా జరుగుతున్నాయని, అతి త్వరలోనే రాకపోకలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్పొరేటర్ వెంట గ్రామ పెద్దలు జయనాథ్, కె.కిషోర్, బి.భాస్కర్ తదితరులు ఉన్నారు.

మాస్ట్రో గీతాల సినీ సంగీత విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా 80వ జన్మదినోత్సవం, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 77వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 3న కళాభారతి ఆడిటోరియంలో మాస్ట్రో ఇళయరాజా స్వర పరచిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు యాక్మీ స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రతాప్‌కుమార్ తెలిపారు. సంగీత విభావరి పోస్టర్‌ను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరింపజేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, ప్రపంచ పర్యావరణ దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 3న సాయంత్రం 6 గంటలకు కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో సినీ నేపథ్య గాయకులు నిత్య సంతోషిని, నెల్లూరు రాము, నాదప్రియ, ఐఏఎస్ అధికారి డాక్టర్ జి. లక్ష్మీశా, హజ్రత్, యాక్మీ ఆనంద్‌కుమార్, డి. భూపతిరావు ఇళయరాజా స్వర పరచిన గీతాలు ఆలపించనున్నారని ప్రతాప్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, యాక్మీ ప్రతినిధులు పి. పర్వేష్, కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: అత్తింటివారి వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఇద్దరిని ద్వారకా జోన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. వివరాలిలా.. సీతంపేట గణేష్‌నగర్‌కు చెందిన చిట్టి సురేఖ(24)కు అదే ప్రాంతానికి చెందిన గొరుసు శ్రీనివాసరెడ్డితో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ మధ్య కాలంలో అత్తారింట్లో సురేఖకు వేధింపులు మొదలయ్యాయి. సూటిపోటి మాటలతో మానసిక క్షోభకు గురి చేయడంతో గత నెల 30న(మంగళవారం) ఆమె ఉరి వేసుకుని మృతి చెందింది. సురేఖ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ద్వారకా జోన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో మృతురాలి అత్త రమాబాయి, అత్త తండ్రి అప్పలరెడ్డిని గురువారం ఎస్ఐ ధర్మేంద్ర అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నారు.



